సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ వాడండి

కడప అర్బన్ : ద్విచక్ర వాహనదారులు సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పకుండా వాడాలని పోలీసు అధికారులు తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప ట్రాఫిక్ సీఐ డి.కె జావేద్, కె.ఎస్.ఆర్.ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఆటోలకు ఫ్లెక్సీలు, స్టిక్కర్లు అంటించి విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ డి.కె జావేద్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు.



హెల్మెట్ ధరించి వాహనాల ర్యాలీలో పాల్గొన్న కడప ట్రాఫిక్ సీఐ డి.కె జావేద్

ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. హెల్మెట్ ధరించని వారిపై ఎం.వి.యాక్ట్ ప్రకారం జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలన్నారు. హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత, మీ కుటుంబం ఆనందం గురించి ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది, కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వన్యప్రాణుల కోసం నీటి తొట్ల ఏర్పాటు



నీటి తొట్లను తీసుకు వెళుతున్న సేవా సమితి ప్రతినిధులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నగర శివార్లలోని గువ్వల చెరువు ఘాట్‌లో ప్రాజెక్ట్ పశు పరిచర్యలో భాగంగా జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి, వింగ్స్ ఆఫ్ హ్యూమానిటీ సంయుక్త ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంక్షేమం కోసం నీటి తొట్లను ఏర్పాటు చేశారు. సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్, సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కాశీ, సంస్థ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సుమంత్, గణేష్, అఖిలేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లను అందజేస్తున్న ఆప్‌కీ ఆవాజ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పేదలు రంజాన్ పండుగను నిర్వహించుకునేందుకు రంజాన్ కిట్లను దాతల సహాయంతో అందజేస్తున్నామని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆప్ కీ ఆవాజ్ మహిళా కన్వీనర్ రిజ్వానా, గౌసియా, మెహనూర్, కరీమున్, గఫూర్, గోరి మెహతా తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌శర్మకు విప్ర విభూషణ్ పురస్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన అర్చకుడు వారణాసి శ్రీధర్‌శర్మకు విప్ర విభూషణ్ పురస్కారం లభించింది. ఆయన సమాచారం మేరకు బుధవారం రాజమహేంద్రవరం దువ్వూరి రామకృష్ణారావు ట్రస్టు మండపంలో ఈ పురస్కార ప్రదానోత్సాహాన్ని నిర్వహించారు. మొత్తం ఐదుగురికి ఈ అవార్డు పురస్కారాన్ని ప్రదానం చేయగా, కడపజిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌కు ప్రదానం చేశారు. సమాఖ్యకార్యదర్శి యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు పాదిలి నారాయణమూర్తి, సుదర్శన దుర్గాబాబు, కన్వీనర్ తెన్నేటి సునీల్‌శర్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేసిన తర్వాత కార్మికులతో షఫీ

కడప కార్పొరేషన్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని 30వ డివిజన్‌లో పనిచేసే 27 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు పవిత్రంగా, సంతోషంగా జరుపుకునే పండుగ నాడు కార్మికులు కూడా సంతోషంగా ఉండాలని ప్రతి ఏటా దుస్తులు పంపిణీ చేస్తున్నామని, ఈసారి కూడా దుస్తులు పంపిణీ చేశామన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు పరిశ్రమలను సందర్శించడం ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై అవగాహన పెంచుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్ర నాథ్ అన్నారు. బుధవారం కళాశాల వాణిజ్య శాస్త్ర విద్యార్థులు కడప నగర శివారు ప్రాంతంలోని పారిశ్రామిక వాడను సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు మారుతి ఇండస్ట్రీస్, గంగా ప్లాస్టిక్, ఆల్ సఫా పరిశ్రమలను సందర్శించారు. ఇందులో భాగంగా వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే వ్యవస్థాపకులుగా ఎదగాలన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, సబ్సిడీలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ మధుసూదన, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ నాగరాజు, రెడ్డి బాషా, రాధిక, లావణ్య, మంజు భార్గవి పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సమావేశం గురువారం కడప నగరంలో నిర్వహించనున్నామని ఆ వేదిక ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పది పరీక్షల సందర్భంగా ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారిని అగౌరవపరచడం తగదని.. ఈ అంశంపై సమావేశంలో చర్చించి కార్యాచరణను రూపొందిస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు.

ఎమ్మెల్యే తానా...కార్పొరేషన్ అధికారుల తందానా

- మేయర్‌కు నోటీసుల వెనుక కార్పొరేషన్ అధికారుల పాత్ర
- ఆర్ఓ అనుమతి లేకుండా నామినేషన్ పత్రాల తస్కరణ
- ఒరిజినల్ నామినేషన్ పత్రాలు లేకపోయినా అటెస్టేషన్ చేసిన డీఈఈ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి తానా అంటే కార్పొరేషన్ అధికారులు తందానా అంటూ వంత పాడుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే ఈ విషయం ఎవరికైనా అర్థమవుతోంది. తాజాగా మేయర్‌కు నోటీసుల వెనుక కూడా కార్పొరేషన్ అధికారుల సహకారం, పాత్ర ఉందని తేటతెల్లమైంది. కడప మేయర్ కె. సురేష్ బాబు తమ కుటుంబ సభ్యులకు నగరపాలక సంస్థలో కాంట్రాక్టు వర్కులు ఇచ్చారని ఎమ్మెల్యే మాధవి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు చేసే క్రమంలో వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ యజమాని కె. అమరేష్ బాబు అనే వ్యక్తి మేయర్ కె. సురేష్ బాబు కుమారుడే అని ధ్రువీకరించడానికి మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ ఎన్నికల అధికారులకు సమర్పించిన నామినేషన్ పత్రాలను, అఫిడవిట్లను ఎంచుకున్నారు. ఆ నామినేషన్ పత్రాల్లో భార్య, కుమార్తె, కుమారుల పేర్లను, ఆస్తుల వివరాలను పొందుపరచడం సర్వసాధారణమే. అయితే ఈ పత్రాలను సబ్ ట్రెజరీ కార్యాలయంలో, ఆర్ఓ ఆధీనంలో ఉంచుతారు. వారి అనుమతి లేనిదే ఎవరికీ ఇవ్వరు. అలాంటి పత్రాలు ఎమ్మెల్యే మాధవికి అతి సులభంగా లభించినట్లు తెలుస్తోంది. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆర్ఓ అనుమతి లేకుండా ఈ పత్రాలను తస్కరించి ఇవ్వగా, ఒరిజినల్ పత్రాలు చూసి అటెస్టేషన్ చేయాల్సిన అధికారి అవేమీ లేకుండా అటెస్టేషన్ చేసినట్లు తెలుస్తోంది. ఇంజినీరింగ్ విభాగంలో ఒక ఈఈ ఆదేశాల మేరకు నాలుగు నెలల క్రితం కొత్తగా వచ్చిన ఒక డీఈఈ ఆ పత్రాలపై అటెస్టేషన్ చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే మెప్పు పొందేందుకు టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయులను వేధించడం తగదు

కడప ఎడ్యుకేషన్ : పరీక్షా కేంద్రాలలో వాటర్ బాయ్ చేసిన తప్పులకు పదవ తరగతి పరీక్షా విధులు నిర్వహిస్తున్న చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్‌లను బాధ్యులు చేస్తూ విధుల నుండి సస్పెండ్ చేయడం తగదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి , ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధనరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతే కాకుండా వారిని తలకు ముసుగులు వేసి మీడియా ముందు ప్రవేశ పెట్టడం సబబుకాదన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు అవసరం

కడప కల్చరల్ : పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు నిర్వహింపజేయాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ కోరారు. బుధవారం కృపా కాలనీలోని చర్చిలో వారు మాట్లాడారు. రాజమండ్రికి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందారని, దీనిపై సమగ్ర విచారణ నిర్వహిస్తేనే నేరస్తులెవరో తెలుస్తుందని, ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : పాస్టర్ డాక్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలని సీఆర్పీఎఫ్ నాయకులు కోరారు.

కడప సీఆర్పీఎఫ్ నాయకులు, స్టేట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ శేషం ప్రసాద్, కడప జిల్లా ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ ప్రసాద్ రావు, జిల్లా జాయింట్ సెక్రెటరీ ప్రేమ్, స్టేట్ యూత్ వైస్ ప్రెసిడెంట్ ఇల్లూరి సురేష్, పాస్టర్ జవహర్, పాస్టర్ డేవిడ్ కరుణాకర్ తదితరులు మాట్లాడారు.

కడప కార్పొరేషన్ : రాజమండ్రిలో పాస్టర్ పగిడాల ప్రవీణ్ మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు



శిక్షణకు హాజరైన రైతులు, విశ్రాంత అధికారులు

కడప అగ్రికల్చర్ : సేంద్రియ వ్యవసాయంతో పంటల సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని విశ్రాంత వ్యవసాయ అధికారి లూర్థారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద బుధవారం కడప కేంద్ర గిడ్డంగుల సంస్థ రైతులకు కేవీకేలో 'కృషి సంవర్ధనం ' మీద రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేనేజర్ శంతన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో అనేక లాభాలను సాధించవచ్చన్నారు. కేంద్ర గిడ్డంగుల విశ్రాంత అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం వల్ల రైతులకు కలిగే లాభాల గురించి వివరించారు. వేర్ హౌసింగ్ విశ్రాంత అభివృద్ధి అధికారి కృష్ణమనాయుడు అభివృద్ధి, నియంత్రణా చట్టం గురించి రైతులకు అవగాహన కలిగించారు. గ్రామీణ బ్యాంకు విశ్రాంత అధికారి శివశంకర్‌రెడ్డి , వృక్షశాస్త్ర అధ్యాపకురాలు నాగరత్నమ్మ, సాంకేతికాధికారి మల్లికార్జున పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో గిడ్డంగుల సిబ్బంది మధు, శ్రీకాంత్, కొండయ్య, రాజు సింగరయ్య పాల్గొన్నారు.

మూల్యాంకన సిబ్బందికి సౌకర్యాలను కల్పించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 3వ తేదీ నుండి కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో ప్రారంభంకానున్న పదవ తరగతి మూల్యంకన విధులలో పాల్గొనే సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకన ప్రారంభం నాటికి ఎండల తీవ్రత ఎక్కువగా వుండే అవకాశం ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో పాల్గొనే సిబ్బందికి చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సౌకర్యవంతంగా పేపర్లు దిద్దడానికి సరైన బెంచీలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతోపాటు మహిళా ఉపాధ్యాయులకు అవసరమైనన్ని మరుగుదొడ్లను ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. 55 సంవత్సరాల వయస్సు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, వికలాంగులను, చంటి బిడ్డల తల్లులను మూల్యాంకన విధులనుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లాకౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, నరసింహులు, రామసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారణజన్ముడు తాళ్లపాక అన్నమయ్య



అన్నమాచార్య విగ్రహం వద్ద భక్తులు

కడప కల్చరల్ : తాళ్లపాక అన్నమాచార్యులు కారణజన్ములని, ఆయన 522వ వర్ధంతి సందర్భంగా భక్తులు అన్నారు. బుధవారం మున్సిపల్ మెయిన్ హైస్కూలు వద్దగల ఆయన విగ్రహానికి వారు పూలమాలలు అలంకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సూర్యనారాయణరావు మాట్లాడుతూ అన్నమాచార్యుల జయంతులు, వర్ధంతులు భావితరాల స్ఫూర్తికోసం నిర్వహించుకోవాలన్నారు. తొలుత శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోగల అన్నమాచార్యుల విగ్రహం వద్ద అర్చకులు గోపాలకృష్ణశర్మ పూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ హైస్కూలు వద్దగల స్థానిక భక్తులతోపాటు బండారి శివకేశవ, రామమూర్తి, గల్లా వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కోవూరు మస్తానయ్య, రాం మహేష్, మనోహర్ రెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు అర్చకులు విజయభట్టర్ ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలను ఆలపించి చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో అన్నమాచార్యుల విగ్రహ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, బాలకృష్ణ యాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, భారవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లలో కోత విధించడం తగదు

కడప కార్పొరేషన్ : దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలో కోత విధించాలని ప్రభుత్వం భావించడం దుర్మార్గమని హ్యూమన్ రైట్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సుంకేసుల బాదుల్లా అన్నారు. బుధవారం ఆయన కడప రిమ్స్‌ను సందర్శించి వెరిఫికేషన్ కోసం వృద్ధులు పడుతున్న అవస్థలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ప్రభుత్వం వేధిస్తోందన్నారు. పూర్తి చెవుడు, మూగ ఉన్నప్పటికీ బలవంతంగా మాట్లాడు... వినపడిందా అని డాక్టర్లు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. పింఛన్లు ఎలాగైనా కోత విధించాలని ప్రభుత్వం వైద్యులకు టార్గెట్ ఇచ్చినట్లు కనబడుతోందన్నారు. వెరిఫికేషన్ సందర్భంగా దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. వారికి తాగు నీరు, కుర్చీలు ఏర్పాటు చేయలేదని ధ్వజమెత్తారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

28న విద్యుత్ భవన్ ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 28న రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపాలని కోరుతూ విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ షాకులు పేరుతో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని తీవ్రంగా విమర్శించారు. రోజు వారీ డిమాండ్ ను బట్టి చార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి ఈఆర్సీ అనుమతించడం దారుణమన్నారు. ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి, పార్టీ నగర కమిటీ సభ్యులు కుమారస్వామిరెడ్డి, ఎస్.రామకష్టారెడ్డి, విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలి



సర్టిఫికెట్లు అందుకున్న అభ్యర్థులతో జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు ఉత్తమ డ్రైవర్లుగా రాణించి జీవితంలో స్థిరపడాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ స్కూలులో ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న అనేక మంది దేశ విదేశాల్లో డ్రైవర్లుగా విశేష సేవలు అందిస్తున్నారన్నారు. మరికొంతమంది స్వశక్తితో ఎదిగి మరింత మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ సీనియర్లను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని ఆయన సూచించారు. త్వరలో నూతన బ్యాచ్ ప్రారంభమవుతుందని, డ్రైవింగ్ పట్ల ఆసక్తి గల వారు తాము ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 99592 25774, 73828 65145 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ట్రైనర్ ఎస్ఏ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ బుధవారం తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. అక్కడ తరగతి గదులను పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. వేసవిలో పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2024 వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098ను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య, వైద్యాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ జి. జ్యోతి

కడప అర్బన్ : జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 'మధ్యవర్తిత్వం'పై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్ పీజీ సురేష్ మాట్లాడుతూ గొప్పగా చెప్పుకోవడం, సమగ్రమైన ఆసక్తులకు ఆధారిత చర్చల నిర్వచనం, చర్చల శైలి, పోటీ పత్రం, సహకార చర్చల నైపుణ్యాలు, చర్చలకు అడ్డంకులు, వ్యూహాత్మక ప్రిన్సిపల్, ఏజెంట్ అభిజ్ఞ, ప్రతి చర్యాత్మక విలువ తగ్గింపు మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమం అనంతరం కడపలోని న్యాయవాదుల సంఘం (బార్) భవనంలో ఒక గంటపాటు రీసోర్స్ పర్సన్ పీజీ సురేష్, న్యాయమూర్తులతో కలిసి వెళ్లి 'ఒక గంటపాటు న్యాయవాదులకు శిక్షణ'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేరళ నుంచి వచ్చిన రీసోర్స్‌పర్సన్ జి జ్యోతి పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య కారకులను శిక్షించాలి

కడప కార్పొరేషన్ : రాజమండ్రి వికాస్ కాలేజీలో డీ.ఫార్మసీ చదువుతున్న విద్యార్థిని అంజలి ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఫార్మసీ సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మెన్ మద్దెల సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్న్‌షిప్ కోసం అంజలి బొల్లినేని ప్రైవేట్ హాస్పిటల్లో పనిచేస్తుండగా, అక్కడే హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న దీపక్ వేధిస్తుండటంతో...ఆ వేధింపులు భరించలేక ఇంజక్షన్ వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. దీపక్ ఎంత వేధించాడో ఒక లేఖ కూడా రాసిందన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని సమగ్ర దర్యాప్తు చేయించాలని, దీపక్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అంజలి కుటుంబానికి రూ.20 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వంక స్థలాన్ని కాపాడాలి



కడప తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిజాం నగర్‌లో సర్వేనెంబర్ 376లో వంక పోరంబోకు ఆక్రమణకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని రాయలసీమ మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, తస్లీమ్ ఆరోపించారు. బుధవారం నిజాంనగర్‌లో వంక స్థలాన్ని కాపాడాలని కోరుతూ కడప తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నగర్ సర్వే నెంబర్ 376లో ఈ రోజుటికీ ప్రభుత్వ రికార్డులలో వంక అని ఉందన్నారు. అయితే కొంతమంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ఈ స్థలం మాది అని ఎమ్మెల్యే పేరు చెప్పి వచ్చి దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేయడానికి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. తక్షణమే కబ్జాదారులపై చర్యలు తీసుకొని పేదలకు అండగా నిలబడాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని కోరారు. అది వంక పోరంబోకే అని తెలియజేసే పత్రాలను వారు ప్రదర్శించారు.

ఇఫ్తార్ విందు ముస్లింలపై కపట ప్రేమ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కూటమి ప్రభుత్వం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయటం ముస్లింలపై కపటప్రేమను చూపిస్తున్నట్లు ఉందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, నగర కోఆర్డినేటర్ బండి జకరయ్య, ఏఐసిసి కోఆర్డినేటర్ ఎస్ ఏ సత్తార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకర్లతో వారు మాట్లాడారు.

సభ వాయిదా వేయడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం సభను అర్ధాంతరంగా వాయిదా వేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేత చెప్పేది వినకుండా సభ వాయిదా వేయడం తగదన్నారు.